సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

టేక్రియాల్‌లో రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు.

- 8లో ▸



అసౌకర్యాల మధ్య 'ఉపాధి'

ఎండలు ముదురుతున్నాయి. ఉపాధి పనులు కొనసాగుతున్న చోట్ల నీడ, నీరు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

37.5 /23.0

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



కామారెడ్డి టౌన్: సత్ప్రవర్తనతో మెలగాలని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టీ నాగరాణి సూచించారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను న్యాయమూర్తి గురువారం సందర్శించి ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడారు. ఫిర్యాదుల బాక్స్, వంట గది, పరిసర ప్రాంతాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మాయ సురేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీనివాస్‌రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, సిబ్బంది ఖాజా, సమీ ఉల్లాహ్ ఖాన్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



కామారెడ్డి టౌన్: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమంలో గురువారం జిల్లా కేంద్రంలోని 4, 26వ వార్డులలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రధాన చౌరస్తాలో కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పిడుగు మమత, కన్నయ్య, నాయకులు సాయిబాబా, ప్రసన్న, చందు, సాయిలు, కిరణ్, సత్యం, జాకీర్, లక్కపదిని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బయటపడిన రాతి విగ్రహం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మిర్జాపూర్‌లో గతనెల 28వ తేదీన కొందరు వ్యక్తులు భూమిని చదును చేస్తుండగా ఓ పురాతన రాతి విగ్రహం బయటపడింది. ఆరు రోజుల తరువాత సమాచారం అందడంతో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ దానిని పరిశీలించి హనుమాన్ ఆలయం వద్దకు చేర్చారు. విగ్రహం సైనికుడి ఆకారంలో ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అధికారులు తెలిపారు. విగ్రహాన్ని చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి హనుమాన్ మాలధారులు, ప్రజలు తరలివచ్చారు.

రుణమాఫీ అంతేనా..!?

'రైతు రుణమాఫీపై ప్రభుత్వ నిర్ణయం రూ.2లక్షల వరకు ఉన్న రుణం మాఫీ. రూ.2లక్షలకు పైన మాఫీ లేదు. కుటుంబానికి రూ.2లక్షలలోపు రుణం వాటిని మాఫీ చేస్తామన్నాం. ఇలాంటి కుటుంబాలకు మాఫీ చేశాం. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు గందరగోళపడి రైతులను గందరగోళం చేయొద్దు'

– అసెంబ్లీ సమావేశంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతిపక్షాలను పక్కనపెడితే మంత్రి వ్యాఖ్యలపై రైతుల్లో మాత్రం గందరగోళం నెలకొంది. కుటుంబం యూనిట్‌గా రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వారి సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు.

- రూ.2 లక్షల లోపు రుణాలు మాత్రమే మాఫీ
- వ్యవసాయ మంత్రి ప్రకటనతో రైతుల్లో నైరాశ్యం
- చేతులెత్తేసినట్లేనా అని రైతుల్లో సందేహాలు
- కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న వారి సంగతేమిటో..
- స్పష్టత ఇవ్వాలంటున్న రైతులు

కామారెడ్డి క్రైం: కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో రైతు రుణమాఫీ ప్రధానమైనదిగా చెప్పుకోవచ్చు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిధుల కొరత ఉన్నా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేయాలనే సంకల్పంతో చర్యలు మొదలుపెట్టింది. ఏకకాలంలో కాకపోయినా విడతల వారీగా నాలుగుసార్లు రుణమాఫీ నిధులను ప్రభుత్వం జమ చేసింది. ఇదిలా ఉండగా అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రుణమాఫీపై చేసిన ప్రకటన రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న వారికి మాఫీ వర్తిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



దాదాపు లక్ష మంది రైతులకు..

రుణమాఫీ పథకం ప్రారంభానికి ముందు జిల్లాలో మొత్తం 1,98,374 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణాలు పొంది ఉన్నారు. ఎన్నికల హామీ ప్రకారం రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేసేందుకు జిల్లాకు రూ.1,283.14 కోట్లు అవసరం ఉండేవి. కానీ అర్హుల జాబితా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులను మినహాయించారు. రూ.లక్ష లోపు రుణాలు ఉన్న 49,540 మంది రైతులకు మొదటి విడతలో రూ.231 కోట్లు, రెండో విడతలో 24,816 మంది రైతులకు రూ.212 కోట్లు, మూడో విడతలో 16,903 మంది రైతులకు రూ.203 కోట్ల రుణమాఫీ వర్తించింది. రేషన్ కార్డులు లేక, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో, పట్టాపాస్ పుస్తకాల్లో తప్పిదాల కారణంగా రుణమాఫీ వర్తించని వారి సమస్యలను పరిష్కరించి నాలుగో విడతలో రూ.2 లక్షలలోపు రుణాలున్న మరో 8,942 మంది రైతులకు రుణమాఫీ నిధులు జమ చేశారు. అక్కడితో రైతు రుణమాఫీ పథకం అమలు నిలిచిపోయింది. మొత్తం మీద జిల్లాకు సంబంధించి 1,00,201 మంది రైతులకు గాను నాలుగు విడతల్లో కలిపి రూ.717 కోట్లు లబ్ధి చేకూరింది. కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన మొత్తం రైతులు మరో 98 వేల మంది వరకు ఉన్నారు.

స్పష్టత లేని ప్రకటనలు

రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనతో కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షల వరకు మాఫీ ఇస్తామని గతంలో అనేక సార్లు ప్రభుత్వం ప్రకటించి అర్హుల జాబితాను సైతం సేకరించింది. రూ.2 లక్షల పైబడి మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించాలని కూడా సూచించింది. చాలా మంది రైతులు రూ.2 లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని చెల్లించి ఎదురు చూస్తున్నారు. కుటుంబం యూనిట్‌గా తీసుకున్నా రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉంది. తాజాగా వ్యవసాయ మంత్రి మాటల్లో కూడా స్పష్టత లేదని పలువురు అంటున్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తర్వులు రాలేదు



రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాలతో జాబితాను ఇదివరకే పంపించాం. రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలు దాదాపుగా మాఫీ అయ్యాయి. సాంకేతిక సమస్యలు ఎదురైన చోట పరిష్కరించి రుణమాఫీ అందరికీ అందేలా చూస్తున్నాం. రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటివరకు మాకు ఎలాంటి సమాచారం, ఉత్తర్వులు రాలేదు.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

ఆగం చేసిన అకాలవర్షం

- జిల్లాలోని పలు చోట్ల ఈదురుగాలులు, వడగళ్ల వాన
- నేలవాలిన మక్క, రాలిన వడ్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: సాగునీటి సమస్యతో ఇప్పటికే పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతుండగా, గురువారం ఈదురుగాలులు వీస్తూ వర్షం కురవడంతో జిల్లాలోని పలుచోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు జిల్లా అంతటా ఓ మోస్తరు వర్షం కురిసింది. పెద్దకొడప్‌గల్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, నిజాంసాగర్, బాన్సువాడ, రామారెడ్డి, దోమకొండ, మాచారెడ్డి తదితర మండలాల్లోని కొన్ని చోట్ల రాళ్ల వర్షం కురిసి వడ్లు నేల రాలాయి. ఈదురుగాల కారణంగా మక్క నేలవాలింది. పంటలకు ఏమేరకు దెబ్బతిన్నాయనేది తెలియాల్సి ఉంది. కాగా గడిచిన పక్షం రోజులుగా ఎండ కారణంగా ఇబ్బందులు పడిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు.



నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపులో నేల వాలిన మొక్కజొన్నను చూపుతున్న రైతు నర్సింలు



నస్రుల్లాబాద్ మండలం నెమ్లిలో నేలకొరిగిన వరి



పెద్దకొడప్‌గల్‌లో వర్షపునీటిలో కొట్టుకుపోతున్న మక్కలు



బిచ్కుంద మండలం మానేపూర్ గ్రామంలో కురిసిన వడగండ్లు

మహిళల చేతికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- జిల్లాలో 180 కేంద్రాలు అప్పగింత

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తోంది. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సంఘాలకు ఇప్పటికే సోలార్ పవర్ యూనిట్లను, ఆర్టీసీ హైర్ బస్సులు, పెట్రోల్ బంకులు, క్యాంటీన్లతోపాటు మరెన్నో భారీ అవకాశాలు కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లో 99శాతం మంది సభ్యులు వ్యవసాయ కుటుంబాలకు చెందిన మహిళలే ఉంటారు. వారికి వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉంటుంది. ఈ కారణంగా కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నారు. గతంలో జిల్లాలో కేవలం 27 కేంద్రాలు మాత్రమే మహిళలకు కేటాయించగా, ఇప్పుడు ఏకంగా 180 కొనుగోలు కేంద్రాలను అప్పగించారు. జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా అందులో 180 కేంద్రాలను మహిళలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మహిళా సంఘాలకు కేంద్రాలను అప్పగించారు. ఈ సారి కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళల పాత్ర భారీగా పెరిగింది. మహిళా సంఘాలు అన్నింటా సక్సెస్ అవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలోనూ విజయం సాధిస్తారని అధికారులు అంటున్నారు.



కామారెడ్డి మండల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న డీపీఎం రమేశ్‌బాబు

మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ

కామారెడ్డి క్రైం: యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులకు గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని తిమ్మక్‌పల్లి(కె), కోటాల్‌పల్లి, క్యాసంపల్లి తండా, రాఘవపూర్, గూడెం గ్రామాల్లో మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో డీపీఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అప్పగించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఎలాంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఐకేపీ ఏపీఎంలు మోయిజ్, శ్రీనివాస్, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): దేశ ఔన్నత్యాన్ని చాటిన మహనీయులను స్మరిస్తూ వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం, జ్యోతి బాపూలే, సావిత్రీబాయి పూలే, రమాబాయి విగ్రహాలను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌తో కలిసి ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. అంతకు ముందు నంది విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ప్రీతమ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ వక్త, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కాశీం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దీన్, ఏఎంసీ చైర్మన్ సంగ్యా నాయక్, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, గ్రామ అధ్యక్షుడు రాజయ్య, అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు జగ్గ బాల్‌రాజు, విండో చైర్మన్‌లు సదాశివ రెడ్డి, గంగాధర్, ఆయా మండలాల ఎస్సీ సెల్ బాధ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో మహనీయుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ప్రీతం

ఎండైనా.. వానైనా నాలుగు కిలోమీటర్లు నడకే..



ఆ విద్యార్థులు పాఠశాల నుంచి ఇళ్లకు చేరుకోవాలంటే ఎండైనా.. వానైనా కాలి నడకన నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. నస్రుల్లాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునేందుకు లింగంపల్లి, బొప్పాస్‌పల్లి, ఫకీరానాయక్ తండా గ్రామాల నుంచి సుమారు 45 మంది విద్యార్థులు ప్రతిరోజూ వస్తారు. వీరంతా ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఉదయం పూట బస్సు సౌకర్యం ఉంటున్నప్పటికీ ఒంటిపూట బడులు ప్రారంభమైన తరువాత మధ్యాహ్నం వేళ బస్సు సౌకర్యం లేకపోవడంతో సుమారు 4కిలోమీటర్లు నడిచి తమ గ్రామాలకు చేరుకుంటున్నారు. ఒక్కోసారి ఉదయం వేళలో సైతం బస్సు ఉండడం లేదని దీంతో 8కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని అంటున్నారు. గురువారం సైతం ఇలా వర్షంలో నడుస్తూ ఇళ్లకు చేరుకున్నారు. ప్రతిరోజూ ఎండలో నడిచేవారమని, ఈ రోజు వర్షం తడుస్తూ నడుస్తున్నామని విద్యార్థులు తెలిపారు. మధ్యాహ్నం వేళ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- నస్రుల్లాబాద్(బాన్సువాడ)

నాణ్యత, తూకంలో తేడా ఉండొద్దు

రామారెడ్డి: రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సన్న బియ్యం నాణ్యత, తూకంలో వ్యత్యాసం లేకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని రేషన్ షాపులో లబ్ధిదారులకు కలెక్టర్ గురువారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 47శాతం సన్నబియ్యాన్ని పంపిణీ చేశామని, రామారెడ్డిలో 70శాతం పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడామని, సన్న బియ్యం పంపిణీపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రేషన్‌షాపులో నాణ్యత, తూకంలో వ్యత్యాసం ఉంటే వెంటనే సివిల్ సప్లయీస్ అధికారులను సంప్రదించాలని కార్డుదారులకు ఆయన సూచించారు.



రేషన్ షాపులో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఒక్కో బస్తాలో 6 కిలోలు తక్కువ..

- రేషన్ బియ్యం తూకంలో మోసం
- లబోదిబోమంటున్న రేషన్ డీలర్లు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

కామారెడ్డి రూరల్: సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ గోదాం నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో బియ్యం తక్కువగా వస్తోందని రైషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 కిలోల బస్తాలో దాదాపు 4 నుంచి 6 కిలోల వరకు తక్కువగా బియ్యం వస్తున్నాయని అంటున్నారు. ప్రతి 50 కిలోల బస్తాకు బ్యాగు బరువుతో 5.80 గ్రాములు కలిపి ఖచ్చితంగా తూకం వేసి రేషన్ షాపులకు సరఫరా చేయాలి. తాము మాత్రం లబ్ధిదారులకు సరైన తూకంతో బియ్యం పంపిణీ చేస్తుండగా, తమకు సరఫరా అవుతున్న సంచుల్లో బియ్యం తక్కువగా వస్తోందని డీలర్లు వాపోతున్నారు. దీనిని ఎవరు భరించాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే గోదాం నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిలో జిల్లాలోని ఏడు ఎంఎల్ఎస్ పాయింట్ల పరిధిలో ఉందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



చిన్నమల్లారెడ్డిలోని ఓ రేషన్ షాపులో 44.860 కిలోలు వచ్చిన బస్తా

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- హైవేలపై వాహనాలు పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలి
- రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. గడిచిన మూడు నెలల కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల వివరాలు తెలుసుకుని కారణాలపై ఆయా అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై పరిమితికి లోబడి వాహనాల వేగం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పీడ్ గన్‌ల ద్వారా వేగాన్ని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై దృష్టి సారించాలని, అతి వేగం కారణంగా జరిగే ప్రమాదాలు, కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులు

జిల్లాలో 28 బ్లాక్ స్పాట్‌లు

జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న 28 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని పేర్కొన్నారు. ఎక్కువగా రాత్రి 8 గంటల తర్వాత, వేకువజామున సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీటీవో శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు, వైద్య ఆరోగ్య, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పీఆర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రామారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. రామారెడ్డి లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను ఆయన పరిశీలించారు. కన్నాపూర్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ముగ్గుపోశారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులో ఎరువుల తయారీని, పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డీపీవో మురళి, డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి సంజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ సురేందర్, తహసీల్దార్ ఉమాలత, ఎంపీడీవో తిరుపతి, ఎంఈవో ఆనంద్‌రావు, ఆర్ఐ రవికాంత్, ఏపీవో ధర్మారెడ్డి, వ్యవసాయ అధికారిణి భాను శ్రీ, ఏపీవో ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గురువారం పలు శాఖల అధికారులు, మండల అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్, ధరణి, సన్న బియ్యం, గ్రామ పాలన అధికారుల ఎంపిక, తదితర అంశాలపై అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం కోసం మండల స్థాయిలో కమిటీలను రూపొందించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు చేకూర్చాలన్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, చందర్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్త వహించాలి

రాజంపేట: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలని ఎస్సై పుష్పరాజ్ గురువారం తెలిపారు. సెలవుల్లో చెరువులు, బావులలో ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బైక్ తాళాలు ధ్వంసం

భిక్కనూరు: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద నిలిపి ఉంచిన ఐదు బైక్‌ల తాళాలను దుండగులు గురువారం వేకువ జామున ధ్వంసం చేశారు. బైక్‌ల తాళాలను ధ్వంసం చేసిన వ్యక్తుల కదలికలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

అన్నదాతకు అకాల దెబ్బ

- జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం
- నేలవాలిన పంటలు



అన్నారం శివారులో నేలకొరిగిన వరి



కొల్లూర్ శివారులో నేలకొరిగిన వరి.. వాజిద్‌నగర్, శాంతాపూర్ శివార్లలో నేలరాలిన వడ్లు

బాన్సువాడ/నిజాంసాగర్/బిచ్కుంద/నస్రుల్లాబాద్/పెద్దకొడప్‌గల్/బాన్సువాడ రూరల్ : ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంట గురువారం కురిసిన వర్షానికి నేలవాలింది. బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లో, జుక్కల్, మండడంలోని జుక్కల్ చౌరస్తా, కౌలాస్, శాంతాపూర్, గ్రామాల్లో, బిచ్కుంద మండలం వాజిద్‌నగర్, సీతారాంపల్లి, మనేపూర్ గ్రామాలలో, పెద్దకొడప్‌గల్ మండలంలో, బాన్సువాడ మండలం కొల్లూర్, సుల్తాన్‌పూర్ శివార్లలో చేతికొచ్చిన వరిపైరు నేలకొరిగింది. నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంపు గ్రామానికి చెందిన నర్సింలు అనే రైతు మొక్క జొన్న పంట 5 ఎకరాల మేర వర్షానికి నేల కొరిగింది.

కొన్ని చోట్ల వడగండ్లు పడటంతో ధాన్యం నేలరాలగా వరిపైర్లు చీపురు కట్టలుగా మారాయి. బలమైన గాలులు, భారీ వర్షం దాటికి కొన్ని చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పొట్టదశ నుంచి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటపై వడగండ్ల వాన పడటంతో గింజలు పూర్తిగా రాలిపోయాయి. అలాగే రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు పంటలను పరిశీలించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షంతో నిలిచిన మురుగు

- బిచ్కుందలో దుకాణాల్లోకి చేరిన నీరు
- పూడుకుపోయిన కాలువలు



దుకాణాల ముందు నిలిచిన మురుగు నీరు, దోమకొండ శివరాంమందిర్ వద్ద నిలిచిన వర్షపు నీరు

బిచ్కుంద/దోమకొండ: : బిచ్కుందలో రోడ్డు వెడల్పు పనులలో భాగంగా రెండు వైపుల మురికి కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచింది. దీంతో మురుగు నీరు దుకాణాల్లోకి చేరింది. మోకాళ్ల వరకు నీరు నిలవడంతో ప్రజలు, వాహదారులకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువల పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దోమకొండ మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, చింతమాన్‌పల్లి, సంఘమేశ్వర్, లింగుపల్లి, అంబారిపేట, అంచనూరు, సీతారం పల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయ ప్రాంగణం వర్షపునీటితో నిండిపోయింది. బీబీపేట రోడ్డులో వర్షపునీరు రోడ్డుపై నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వక్ఫ్ బిల్లుపై అనవసర రాద్ధాంతం



మాట్లాడుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కామారెడ్డి టౌన్: దేశంలోఅన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లుపై ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీ పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వక్ఫ్ బిల్లు కారణంగా ముస్లిములకు ఎటువంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. ఈనెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలోని ప్రతి బూత్‌లో ఘనంగా నిర్వహించాలని, ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగరవేయాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, నాయకులు సంతోష్ రెడ్డి, రవీందర్, బాల్ రాజు, శ్రీధర్, సంపత్, భూపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి సబ్ స్టేషన్ ఉప కేంద్రంలో గురువారం నూతన బ్రేకర్‌ను ట్రాన్స్ కో ఎస్ఈ శ్రావణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఒకటే బ్రేకర్ ఉండడంతో కొన్ని సమస్యలు తలెత్తాయన్నారు. ఆ సమస్యలు పునరావృతం కాకుండా ఉండడానికే నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏడీ నరేశ్, ఏఈ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను ఏకం చేయడమే ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్



హర్యానా సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

ఎల్లారెడ్డిరూరల్: దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చే కార్యక్రమమే ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తోటగాంధీ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలను, వంటకాలను చేసుకోవడం, ఒకరితో ఒకరు కలుసుకోవడం భాష నేర్చుకునేందుకు ఆసక్తి కనబర్చడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం చిన్నారులు చేసిన హర్యానా డ్యాన్సులు, వంటకాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యారమణ, బల్వంత్‌రావు, శిల్ప, శివకుమార్, అనిల్, ప్రభాకర్, ప్రదీప్ తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ నూతన డిపో మేనేజర్‌గా కరుణాశ్రీ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో పరిగి ఆర్టీసీ డీఎంగా పనిచేసిన ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన డీఎం ఇందిర హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

నేడు కలెక్టరేట్ ముందు ధర్నా

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ నియామకాల్లో జరిగిన అక్రమాలపై టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్యాయానికి గురైన అభ్యర్థులు ఈ ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

THE NIZAMABAD DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD.
Lingampet, Dist: Kamareddy.

ప్రకటన Date: 04/04/2025

శ్రీమతి ఒంటరి సౌజన్య రెడ్డి W/o. ఒంటరి కృష్ణరెడ్డి వయస్సు 38 సం॥ సర్వే నెంబర్ 591/1/2/అ, భూమి విస్తీర్ణం 4.39 గుంటలు గ్రామం మోతె, మం॥ లింగంపేట్, జిల్లా: కామారెడ్డి. మోతె గ్రామంలో సర్వే నెంబర్ 591/1/2/అ, విస్తీర్ణం 4.39 గుంటలు కర్షకమిత్ర లోను నిమిత్తం కొరకు జతపరిచిన ప్రకారం North: ఎ. మంజుల రెడ్డి, East: ఆర్. అరుంధతి, West: ఎ. రవీంధర్ రెడ్డి, South: మోతె లింగంపేట్ వైపు వెళ్లే రోడ్డు. ఇట్టి యజమాని అయ్యి ఉండి సంపూర్ణ స్వాధీనంలో భూమి కలదు. కర్షకమిత్ర లోను కొరకు NDCCB బ్యాంకు బ్రాంచ్ లింగంపేట్ వారి వద్ద తనఖా పెట్టుచున్నాను. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కాని ఆక్షేపణలు కాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

సం/- NDCCB బ్యాంకు మేనేజర్ G. KUMARASWAMY

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

శ్రీగోల్డ్ బైయర్స్ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9010190666. [SCA25002404]

REAL ESTATE

HOUSE FOR SALE

161 గజాలలో స్వంతంగా నిర్మించిన వెయిటింగ్ హాల్, కిచెన్‌తో 2BHK కొత్త ఇల్లు 100% వాస్తుతో అమ్మకానికి కలదు. శివసాయి ఎంక్లేవ్ దగ్గర ముబారక్‌నగర్. 9848612456. [SCA25002570]

WANTED

Wanted Trained Graduates / Post Graduates to teach all Subjects for Primary & High School Classes, Salary Negotiable, Fluency in English is Essential Contact with All Originals from 9 am to 1 pm ST. Xaviers High School, Opp: Forest Office, Varni Road, Nizamabad. Cell Number: 8639189010. [Z-7098]

హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899. [SCA25002557]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌లో జిల్లాలో గురువారం వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందారు. చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు, గోదావరిలో పడి మరొకరు మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నస్రుల్లాబాద్: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన జరపాటి అశోక్(19) అనే యువకుడు నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో ఉన్న రెడ్డి చెరువులో చేపలు పడుతుండగా బుధవారం ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గురువారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం జాన్కంపల్లి ఖుర్దు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జన్పుల నారాయణ (56) గురువారం సాయంత్రం గ్రామ శివారులోని తాటివాని మత్తడి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో ఉన్న వల కాలికి తట్టడంతో నీట మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గోదావరిలో పడి కూలీ..

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన గోనెవార్ గంగాధర్(49) కాలుజారి గోదావరి నదిలో పడి గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన గంగాధర్ బోరు మోటారు పని చేయకపోవడంతో గోదావరి నది ఒడ్డున ఉన్న మోటారు వద్దకు వెళ్లాడని పేర్కొన్నారు. మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరి నదిలో పడి మృతి చెందాడు. భార్య చాయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..



లక్ష్మి మృతదేహం

ఎడపల్లి: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం జైతాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పురిమేటి లక్ష్మి(35) అనే మహిళ ఈ నెల 1న నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె కోసం వెతుకుతుండగా గ్రామ సమీపంలోని పంట కాలువలో ఆమె విగతజీవిగా కనిపించింది. మృతురాలి అన్న నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. పలువురికి స్వల్ప గాయాలు



ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి శివారులో గురువారం ఉదయం కారు బోల్తా పడ్డ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన ప్రహేనంద రామేశ్వరి దంపతులు వారి కుమారుడు రఘుతో పాటు పదేళ్ల వయసున్న మనవరాలితో కలిసి కారులో బాసరకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు గుర్తించి టోల్‌ప్లాజా సిబ్బందికి సమాచారం అందించారు. వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్‌కి తరలించారు. ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా చిన్న పాప కాలుకి తీవ్ర గాయమైనట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం



సంతోష్

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటగిరికి చెందిన వాగ్మారి పూజ తన పన్నెండేళ్ల కుమారుడు సంతోష్‌ను తీసుకొని మార్చి 31న జిల్లా కేంద్రంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో ఉంటున్న అత్తామామల వద్దకు వచ్చింది. అదే రోజు సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59714, 94410 58289 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

‘రాజీవ్ వికాసం’పై విస్తృతంగా ప్రచారం చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మందికి చేయూత
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం



భిక్కనూరులో మాట్లాడుతున్న ప్రీతం

భిక్కనూరు: రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్రంలో ఐదులక్షల మందికి మేలు కలుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీవ్ యువవికాసం పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం ఆరు వందల ఐదు కోట్ల రూపాయాలను కేటాయించందన్నారు. 60 ఏళ్ల లోపు వారందరూ ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను దళిత సంఘం నేతలు ద్యాగల కిరణ్, తుడుం జీవన్, బాబు, అశోక్, లింగం మైపాల్, సంజీవులు దుర్గయ్య, లింగం, ప్రదీప్‌లు సన్మానించారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- భాషోపాధ్యాయులు విద్యార్థులను మాతృ భాషలో తీర్చిదిద్దాలి
- డీఈవో రాజు



కృష్ణాజీవాడిలో మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి టౌన్/తాడ్వాయి : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నూతనంగా పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి ఉన్నత పాఠశాలలో జిల్లాలో పదోన్నతి పొందిన భాష ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యాక్రమానికి హాజరయ్యారు. భాషోపాధ్యాయులు విద్యార్థులను మాతృ భాషలో తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాఠశాల నిర్వహణ, బోధన పద్ధతులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ జిల్లా సమన్వయ కర్త వేణుగోపాల్, డీసీఈబీ కార్యదర్శి లింగం, ఎంఈవో రామస్వామి, నోడల్ అధికారులు శ్రీ నాథ్, సాయిరెడ్డి, రిసోర్స్ పర్సన్ వెంకట రమణ, వెంకటేశం, విజయ్ కుమార్, లోకేశ్వర్ రావు, పవన్ కుమార్, ప్రసాద్, బసంత్ రాజు, కృష్ణ, శ్రీశైలం,రమేష్ , ప్రధానోపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సబ్దల్‌పూర్‌లో పక్షుల కోసం నీరు ఏర్పాటు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం సబ్దల్‌పూర్ గ్రామంలో పంచాయతీ అధికారులు పక్షుల కోసం తాగేందుకు నీటిని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గల చెట్లకు నీటితో నింపిన బాటిళ్లను ఏర్పాటు చేశారు. పక్షుల కోసం నీటిని ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పెంచిన కరువు భత్యం కార్మికులకు ఇవ్వాలి

బీబీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి బీడీ కార్మికులకు పెంచిన కరువు భత్యం వెంటనే ఇవ్వాలని కార్మిక సంఘం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం అన్నారు. గురువారం మండలంలోని తుజాల్‌పూర్‌లో బీడీ కార్మికులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ. 10. 40 పైసలు పెంచారని వెంటనే వాటిని ఇవ్వాలన్నారు.

ఎల్లారెడ్డిలో శివాజీకి ఘన నివాళి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాజీ విగ్రహానికి బజరంగ్‌దళ్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రాజంపేట పీహెచ్‌సీలో అమ్మ ఒడి

రాజంపేట : స్థానిక పీహెచ్‌సీలో గురువారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత తదితరులున్నారు.

కొనసాగుతున్న నిరసన

రాజంపేట : ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాలను అడ్డుకోవాలని కోరుతూ గురువారం రెండో రోజు నిరసన చేపట్టారు. గ్రామంలోని సర్వే నెంబరు 576, 566, 567, 569 ల లోని ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు గురైన భూములపై అధికారులు సమగ్ర సర్వే చేసి గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో శ్రీ వెంకటేశ్వర, శ్రీ రాజరాజేశ్వర, సంగమేశ్వర ఆలయ భూములను సైతం కాపాడాలని ఈ సందర్భంగా కోరారు. కొప్పుల నరేష్, ముత్యపు సిద్ధ రాములు, వీరన్నపటే ల్, మనోహర్‌రెడ్డి, సాదుల శివకుమార్, బెస్త రాజు, తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎస్పీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లింగంపేట: మండలంలోని భవానిపేటలో ఓ బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన చిలుక సత్యనారాయణ బుధవారం మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి బుధవారం బైక్‌పై వెళ్లాడు. ఆలయం నుంచి తిరిగి వచ్చేసరికి బైక్ చోరీకి గురైంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

- ల్యాప్‌టాప్, బ్యాగు అపహరణ
- టేక్రియాల్‌లో రెచ్చిపోయిన దుండగులు



బాధితుడు రాఘవయ్య



కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీరరాఘవయ్య కుమారుడు నాగమణిదీప్ హైదరాబాద్‌లో పదో తరగతి చదువుకుంటున్నాడు. పరీక్షలు పూర్తి కావడంతో వీరరాఘవయ్య కుమారుడిని స్వగ్రామానికి కారులో తీసుకొస్తున్నాడు. వీరి వెంట వీరరాఘవయ్య స్నేహితుడైన మరో వ్యక్తి కూడా ఉన్నారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో టేక్రియాల్ వద్ద పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఓ హోటల్ ఎదుట రోడ్డు పక్కన కారు నిలిపి అందులో నిద్రించారు. ఇది గమనించిన నలుగురు దుండగులు కారు అద్దాలను పగలగొట్టి దాడి చేశారు. కారులోని ఓ బ్యాగు, ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లారు. ఈ దాడిలో వీర రాఘవయ్యకు గాయాలయ్యాయి. దాడి జరిగిన వెంటనే భయంతో రాఘవయ్య కారు స్టార్ట్ చేసి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలోని సదాశివనగర్ వరకు తీసుకెళ్లారు. అక్కడ కారును నిలిపి డయల్ 100 కు సమాచారం ఇచ్చాడు. ఎస్పీ రాజేశ్ చంద్ర, దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

బీబీపేట: కిడ్నీల సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఇస్సానగర్ గ్రామానికి చెందిన చెవుల లక్ష్మి(60) గత మూడేళ్లుగా కిడ్నీల సమస్యతో బాధపడుతోంది. ఈ నెల 2న తన తల్లిగారింటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. భర్త ఎల్లయ్య గురువారం సాయంత్రం అత్తగారింటికి ఫోన్ చేసి ఆరా తీయగా ఇంకా రాలేదని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం పెద్ద చెరువులో మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్నేహితురాలి మృతి తట్టుకోలేక యువకుడు..

ఖలీల్‌వాడి: స్నేహితురాలి మృతి తట్టుకోలేక ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని గాయత్రినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గాయత్రినగర్‌కు చెందిన పవన్‌రాజు స్థానికంగా ఉండే ఓ షాప్‌లో పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతని స్నేహితురాలు మృతి చెందింది. దీంతో నాటి నుంచి ఎవరితో మాట్లాడకుండా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కామారెడ్డి క్రైం: అదుపు తప్పిన ఓ కారు బోల్తా పడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. టేక్రియాల్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న ఓ కారు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంతంలోకి రాగానే అదుపు తప్పి పల్టీ కొట్టింది. బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.